## సన్నాహక సమావేశానికి తరలిన బీఆర్ఎస్ 'బలగం'

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు..



మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డితో బీఆర్ఎస్ వర్ని నాయకులు

వర్ని, ఏప్రిల్ 15 : బాన్సువాడ పట్టణంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి వర్ని మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నిజామాబాద్ నుంచి వర్నికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డికి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బైక్‌లపై బాన్సువాడకు తరలివెళ్లారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాన్ని బాన్సువాడలో ఏర్పాటు చేశారు. తరలిన వారిలో బీఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ ఎజాజ్, మండల సీనియర్ నాయకులు జలాల్‌పూర్ శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, ప్రవీణ్ యాదవ్, ఉస్మాన్, ఇసాక్, జక్రి నరేందర్, పోశెట్టి, రాచప్ప, గుని శ్రావణ్, గైని లక్ష్మణ్, అలీం పాల్గొన్నారు.

## కోటగిరి సహకార సంఘంలో కొనసాగుతున్న 'బోనస్' విచారణ

కోటగిరి, ఏప్రిల్ 15 : కోటగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బోనస్ కాజేశారనే విషయంపై జిల్లా సహకార బ్యాంకు అధికారులు మంగళవారం విచారణ ప్రారంభించారు. సహకార బ్యాంకు క్లస్టర్ ఇన్‌చార్జి, విచారణ అధికారి అంబర్‌సింగ్ మాట్లాడుతూ.. రైతుల వారీగా విచారణ చేపడుతున్నామని, విచారణ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. విచారణ చేపట్టిన వారిలో సహకార బ్యాంకు సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రియాజుద్దీన్, అలీ తదితరులు ఉన్నారు. విచారణ పారదర్శకంగా చేట్టాలని, కాజేసిన డబ్బులను రికవరీ చేసేలా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి విచారణకు వచ్చిన అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు నల్ల గంగాధర్, గుడాల రాములు, రాజు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన పలువురికి జైలు శిక్ష

డిచ్‌పల్లి/ వినాయక్‌నగర్, ఏప్రిల్ 15 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. డిచ్‌పల్లి సర్కిల్ పరిధిలో ఆకుల కొండూర్‌కు చెందిన తనుగు ప్రవీణ్, బర్ధిపూర్ గ్రామానికి చెందిన ములుగు శామ్యూల్, డిచ్‌పల్లికి చెందిన జీనడం మల్లేశ్, డీబీ తండాకు చెందిన గుగులోత్ మోహన్ మద్యం తాగి పట్టుబడగా.. స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన సంతోష్‌నగర్, జక్రాన్‌పల్లికి చెందిన బోదాసు తిరుపతికి సైతం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన ఐదుగురికి రూ.12 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఐదో టౌన్ పరిధిలో చింతల కుమార్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో పట్టుబడిన బత్తుల యాదగిరి, నాగెల్లి గంగయ్యకు ఒక్కో రోజు చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ

బోధన్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వెంకటేశ్వరావు దేశాయ్ – మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్ కుమారుడు, బీఆర్ఎస్ యువనేత ప్రీతమ్ దేశాయ్ ఇటీవల మృతిచెందాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. బోధన్‌లోని ప్రీతమ్ దేశాయ్ ఇంటికి వెళ్లిన కవిత వెంకటేశ్వరరావు దేశాయ్, సునీతాదేశాయ్ దంపతులను, సతీమణి శిల్ప దేశాయ్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్సీ కవిత వెంట వచ్చిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దేశాయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట పార్టీ బోధన్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.



బోధన్‌లో ప్రీతమ్ దేశాయ్ తల్లిదండ్రులు, సతీమణి, కుమార్తెను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## విషపు నీరు తాగి 44 గొర్రెలు మృత్యువాత

- బోరున విలపించిన బాధితులు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన అధికారులు



గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మాలతి, రోదిస్తున్న బాధితులు

ధర్పల్లి, ఏప్రిల్ 15 : విషపు నీరు తాగిన సుమారు 44 గొర్రెలు, మేకలు మృతిచెందిన ఘటన మండలంలోని హొన్నాజీపేట్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు, తహసీల్దార్ మాలతి తెలిపిన వివరాల ప్రకారం.. హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన కుర్మ పెద్దోళ్ల పెద్ద రాజయ్య, కుర్మ గంప రాజయ్యకు చెందిన సుమారు 44కి పైగా గొర్రెలు, మేకలు గ్రామ పరిధిలోని ఓ రైతుకు చెందిన వరి పంట కోసిన పొలంలో చనిపోయాయి. అక్కడే ఉన్న యూరియా కలిసిన నీటిని తాగడంతోనే గొర్రెలు చనిపోయి ఉంటాయని భావిస్తున్నారు. బాధితులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని పశువైద్యుడు అభిషేక్ పరిశీలించారు.నీరు ఎలా విషపూరితంగా మారిందో తెలియాల్సి ఉందని అన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## పీజీ పరీక్షల ఫలితాల విడుదల

- డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 : టీయూ పరిధిలోని పీజీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించిన మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను టీయూ వీసీ ఆచార్య యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి మంగళవారం విడుదల చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య సంపత్‌కుమార్, అడిషనల్ కంట్రోలర్ సంపత్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

ధర్పల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని గోవింద్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న వాటర్ హార్వెస్టింగ్ పనులను ఎంపీడీవో బాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంలో కురిసిన నీరు వృథా కాకుండా వాటర్ హార్వెస్టింగ్ గుంతలను 20x20 మీటర్ల విస్తీర్ణంలో తవ్విస్తున్నట్లు తెలిపారు.

## ఉద్యోగ విరమణ పొందిన వారికి అనేక సమస్యలు

రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం చీఫ్ లీగల్ అడ్వైజర్, రిటైర్డ్ డీఎస్పీ మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న వి. మనోహర్

వినాయక్‌నగర్, మార్చి 15 : ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని రాష్ట్ర రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ చీఫ్ లీగల్ అడ్వైజర్, రిటైర్డ్ డీఎస్పీ వి.మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించగా.. ఆయన హాజరై మాట్లాడారు. ఆరోగ్య భద్రత, పెన్షన్ పెంపు, పీఆర్సీ అమలు కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రిటైర్డ్ సీఐ ఎం.నాగేందర్, గౌరవ అధ్యక్షులుగా సుదర్శన్ రాజ్, కిషన్, శివాజీ, మక్సూద్, ఉపాధ్యక్షులుగా జగన్నాథం, హమీదుద్దీన్, నయీం, ప్రధాన కార్యదర్శిగా లింగన్న, కోశాధికారిగా టి.నారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



నగరంలో విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వినాయక్‌నగర్/ ఇందల్వాయి/ శక్కర్‌నగర్/ నందిపేట్, ఏప్రిల్ 15 : అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయి రెడ్డి.. సిబ్బందితో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. బస్టాండ్, మాల్స్ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాలు సంభవించిన సమయాల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు, సిబ్బంది, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. ఇందల్వాయి బస్టాండ్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై రూరల్ అగ్నిమాపక శాఖ అధికారి విక్రమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వేణు, రవి, ప్రదీప్, చారి పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లు అతికించారు. రైల్వేస్టేషన్ మాస్టర్ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథం, అగ్నిమాపక సిబ్బంది మోసిన్, ఆనంద్, రాహుల్ పాల్గొన్నారు. నందిపేట్‌లోని బస్టాండ్, వివేకానంద చౌరస్తా వద్ద నీటితో విన్యాసాలు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు నర్సింగ్‌రావు, నరేశ్, సురేశ్, సురేశ్, సూరజ్ పాల్గొన్నారు.

## న్యాయమూర్తుల బదిలీ



జిల్లా జడ్జి సునీత కుంచాలకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వినాయక్‌నగర్, మార్చి 15 : రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ న్యాయమూర్తులను బదిలీ చేస్తు హైకోర్టు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పెద్దపల్లి జిల్లా జడ్జిగా, బోధన్ జడ్జి రవికుమార్ గద్వాలకు బదిలీ అయ్యారు. ఎల్‌బీనగర్ జడ్జిగా ఉన్న హరీశ.. నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా రానున్నారు. హైదరాబాద్ లేబర్ కోర్టు జడ్జి జీవీఎన్.భరతలక్ష్మి నిజామాబాద్ సెషన్స్ జడ్జిగా బదిలీపై రానున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాలను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయారెడ్డి, మాణిక్‌రాజ్‌తోపాటు కార్యవర్గం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

## కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్, ఏప్రిల్ 15 : మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 6వతరగతిలో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోనాఫైడ్, ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బర్త్, కుల, ఆదాయ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, పాఠశాల నుంచి 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం ఉన్న విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

## నగరంలో మత్తు పదార్థాల పట్టివేత?

వినాయక్‌నగర్, మార్చి 15 : నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో మత్తుపదార్థాన్ని పట్టుకున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ట్రైనీ ఐపీఎస్ అధికారి, రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొత్త కలెక్టరేట్ పరిధిలోని ఖానాపూర్ చౌరస్తా వద్ద ఓ కారును తనిఖీ చేశారు. ఆ కారులో నుంచి కల్లులో కలిపేందుకు వినియోగించే అల్ప్రాజోలం స్వాధీనం చేసుకొని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్‌ను వివరణ కోరగా.. ఓ కారులో నుంచి పౌడర్‌లాంటి పదార్థాన్ని పట్టుకున్నది వాస్తవేనని, అది మత్తుపదార్థమా లేక ఇతర ఏదైనా పదార్థమా అనే కోణంలో విచారణ జరుపుతున్నామని, విచారణ పూర్తయిన అనంతరం వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

## దాడులకు పాల్పడిన ముగ్గురికి రిమాండ్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 15 : నగరంలోని అహ్మద్‌పుర కాలనీలో రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో పరస్పరం దాడులకు దిగిన రెండు వర్గాలపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రెండో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు. కేసులు నమోదు చేసిన వారిలో ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. నిందితులకు 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించడంతో జైలుకు పంపామని వివరించారు.

## టీయూ వీసీకి సమ్మె నోటీసు అందజేత

డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 : తమ సమస్యలు పరిష్కరించాలని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలిపారు. స్టేట్ బాడీ కమిటీ పిలుపు సమ్మె నోటీసును టీయూ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరికి మంగళవారం అందజేశారు. అడ్మినిస్ట్రేషన్ పొజిషన్‌లో ఉన్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు గంగాకిషన్ అసిస్టెంట్ వార్డెన్ కిరణ్ రాథోడ్, సౌత్ క్యాంపస్‌లో పని చేస్తున్న అసిస్టెంట్ వార్డెన్, పీఆర్వో సరిత, డాక్టర్ వేద్రాద్రి, సునీత, వైశాలి స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శ్రీనగర్‌లో మాట్లాడుతున్న రసూల్ బీ

సారంగాపూర్/ డిచ్‌పల్లి, ఏప్రిల్ 14 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రసూల్ బీ అన్నారు. మండలంలోని శ్రీనగర్‌గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంనారాయణ, సీడీపీవో సౌందర్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సమీనాబేగం, పంచాయతీ కార్యదర్శి సందీప్, అంగన్‌వాడీ టీచర్ అనురాధ పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని గొల్లపల్లి, అమృతాపూర్, అమృతాపూర్ క్యాంప్, దేవానగర్ క్యాంప్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సూపర్‌వైజర్లు దేవపాల, శోభారాణి, స్వప్న, బుజ్జి, అంగన్‌వాడీ టీచర్లు రాధ, రజిత, జ్యోతి, సులోచన పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయకపోవడం బాధాకరం-** పోతంగల్, ఏప్రిల్ 15 : మండలంలో నూతనంగా ఏర్పాటైన ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం పెట్టకపోవడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ నాయకుడు పోచీరాం అన్నారు. 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా అయినా మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ ఫొటో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.
- **పీడీఎస్‌యూ నాయకుల కొవొత్తుల ర్యాలీ -** ఖలీల్‌వాడి, ఏప్రిల్ 15 : నగరంలోని సుభాష్‌నగర్‌లో పీడీఎస్‌యూ నాయకులు సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జయంతి, జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రజిత, సౌమ్య, వినోద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.
- **నడ్పల్లి జీపీ కార్యదర్శిగా రాధిక బాధ్యతల స్వీకరణ -** డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని నడ్పల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా రాధిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన పంచాయతీ కార్యదర్శి ఉద్యోగ విరమణ పొందడంతో ఆరేపల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రాధికకు నడ్పల్లి పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెకు పంచాయతీ సిబ్బంది రజత్‌కుమార్, బిల్ కలెక్టర్లు రాము, సంతోష్, నర్సయ్య, బాబా తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.
- **అంతర్జాతీయ వర్క్‌షాప్‌కు హాజరుకావాలని టీయూ ప్రొఫెసర్‌కు ఆహ్వానం -** డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 : దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో హెవెన్లీ కల్చర్ వరల్డ్ పీస్ రిస్టోరేషన్ ఆఫ్ లైట్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించే పాత్రికేయ విద్య అంశంపై నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొనాలని టీయూ సోషల్ సైన్స్ ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్ మంగళవారం ఆహ్వానం అందుకున్నారు. కేవలం రెండు రోజుల ముందే ఆహ్వానం అందడంతో తాను సియోల్ వరకు రాలేనని, ఆన్‌లైన్‌లో హాజరవుతానని నిర్వాహకులను చంద్రశేఖర్ కోరగా.. ఆ సంస్థ ఆమోదం తెలిపినట్లు చెప్పారు.
- **రక్తదాన శిబిరం-** ఎడపల్లి, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని మంగళ్‌పహాడ్ చౌరస్తా వద్ద నిజామాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. 50 మందికిపైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.
- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన -** భీమ్‌గల్, ఏప్రిల్15: మండలంలోని లింగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మంగళవారం ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఇద్దరు లబ్ధిదారుల ఇండ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆరోపణలు అవాస్తవం'

ఏర్గట్ల, ఏప్రిల్ 15: ఈత చెట్లను వీడీసీ వారు దహనం చేయించారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని తాళ్లరాంపూర్‌లో ఆసంఘం సభ్యులు పేర్కొన్నారు. గ్రామంలో మంగళవారం వీడీసీ సభ్యులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల గ్రామంలోని గౌడ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర ప్రధాన జాన్ వెస్లీ, గౌడ సంఘ జిల్లా నాయకుడు యాదగౌడ్, సాయిలు మాట్లాడిన మాటలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తాము ఎవరినీ బహిష్కరించలేదని అన్నారు. కొందరు కావాలని గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.

## చెక్ పోస్టు ప్రారంభం

రెంజల్, ఏప్రిల్ 15: మహారాష్ట్ర – తెలంగాణ సరిహద్దులోని కందకుర్తి సమీపంలో ధాన్యం తరలించే వాహనాలకు తనిఖీలు చేపట్టేందుకు మంగళవారం చెక్ పోస్టును ప్రారంభించినట్లు రెంజల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు వెల్లడించారు. మహారాష్ట్రలో పండించిన ధాన్యాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా ఉండేందుకు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో తనిఖీలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రమోహన్, గిర్దావర్ రాజు, జీపీ కార్యదర్శి నవీన్ ఉన్నారు.

## నేడు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పర్యటన

మోర్తాడ్, ఏప్రిల్ 15: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలో అగ్రికల్చర్, సివిల్‌సప్లయ్, మార్కెటింగ్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, రూరల్ అండ్ అర్బన్ వాటర్‌సప్లయ్ డిపార్ట్‌మెంట్స్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు ఆర్మూర్‌లో సన్నబియ్యం పంపిణీ పథకం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తారు. ఆర్మూర్‌లోని క్షత్రియ పంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారు. ఆర్మూర్‌లో గుండ్ల చెరువు వద్ద రూ.3కోట్లతో నిర్మించే మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నవీపేట/రెంజల్, ఏప్రిల్ 15: డ్రంకన్ డ్రైవ్‌లో ఆభంగపట్నం గ్రామానికి చెందిన పురం అశోక్, ప్రకాశం జిల్లాకు చెందిన దాసరి కొండల్ రావుకు నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం కోర్టు తీర్పు వెల్లడించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన మధకర్ కాంబ్లే (మహారాష్ట్ర)కు చెందిన వ్యక్తికి బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి ఒక రోజు జైలు శిక్ష విధించారని రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మరో వ్యక్తి రూ. నాలుగు వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

## ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, ఏప్రిల్15: భీమ్‌గల్ మండలంలోని గోన్‌గొప్పుల్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి వైద్య చికిత్సల నిమిత్తం మంజూరైన రూ.లక్ష 10 వేల విలువైన ఎల్‌వోసీని మంగళవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. గ్రామానికి చెందిన గోపరి ఒడ్డన్న అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని దవాఖానలో చేరారు. వైద్య చికిత్స నిమిత్తం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో కుటుంబ సభ్యులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని ఆశ్రయించారు. ఆయన వారికి ప్రభుత్వం ద్వారా ఎల్‌వోసీని మంజూరు చేయించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు శ్రీరాం భూమేశ్వర్, రాగి నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లికి వేముల పూజలు

మోర్తాడ్, ఏప్రిల్ 15: కమ్మర్‌పల్లి మండల బషీరాబాద్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ తల్లిజాతరలో మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వేములకు పండితులు, స్వాములు, మహిళలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించి గంగమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

మోర్తాడ్/శక్కర్‌నగర్, ఏప్రిల్ 15: మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన ప్రశాంత్‌కుమార్, గణేశ్‌లో తమ ఫోన్లు పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ఆచూకీ తెలుసుకుని భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై విక్రమ్ మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అందజేశారు. బోధన్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ యజమానులకు బోధన్‌లో అప్పగించారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd,** Armoor Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Ramolla Bala Subhramanyam** S/o. Ramolla Gangaram, Age 39 Yrs, Occ: Business R/o.H.No.3-30/3, SC Wada, Bada Bheemgal(V), Bheemgal (M), Nizamabad (Dist) on mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice.

**SCHEDULE OF THE PROPERTY**

The Existing RCC Roofed House bearing G.P.No.1-76/H/3, admeasuring total site area 36'-0" x 36'-0"= **1296.00 Sq.Fts or 144.00 Sq.Yds or 120.39 Sq.Mtrs** and RCC Roofed built up area 200.00 Sq.fts, situated at Manoharabad Village of Jakranpally Mandal, Gram Panchayat Manoharabad, Mandal Parishad Jakranpally, District and Zilla Parishad Nizamabad Regn. Dist Nizamabad and Regn. Sub Armoor **Bounded as below: North:** House of Kudala Rajubau **South:** Open Place of Kothapally Poshetty, **East:** Road, **West:** Open Place of Pabba Raju

**Sd/- R.JAGADISHWER RAO,** Advocate Subhashnagar, Nizamabad, Cell:9848094409

## బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించన్ను మహా సభకు అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

## కిశోరబాలికలకు రక్తపరీక్షలు

మోర్తాడ్, ఏప్రిల్ 15: మండలంలోని మోర్తాడ్ బాలికల హాస్టల్, సుంకెట్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరబాలికలకు వైద్యసిబ్బంది ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు నిర్వహించారు. సుంకెట్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, సుజాత, పుష్పలత, జ్యోతి, ఘనశారద పాల్గొన్నారు.

## వీడీసీని రద్దు చేయాలంటూ ధర్నా



ఆర్మూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గీత కార్మికుల కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్న వీడీసీని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆర్మూర్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకుడు ఎల్లన్న మాట్లాడుతూ చట్టబద్ధత లేని వీడీసీలపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వీడీసీలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బోధన్ తహసీల్ కార్యాలయంలో సీపీఎం బోధన్ ఏరియా కార్యదర్శి జె.శంకర్ గౌడ్ తదితరులతో కలిసి తహసీల్దార్ విఠల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దాసి గోపి, ప్రభాస్, కాశీనాథ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బాల్కొండ, ఏప్రిల్ 15: మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.25,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం జలాల్‌పూర్‌లో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, లింబారెడ్డి, ప్రదీప్, నగేశ్, గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సారెడ్డి, పెద్ద నడ్పి నర్సారెడ్డి, భోజన్న, నితీశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

## అదృశ్యమైన ఇద్దరు యువతులు లభ్యం

నవీపేట, ఏప్రిల్ 15: అదృశ్యమైన ఇద్దరు యువతులు లభ్యమైనట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఆభంగపట్నం గ్రామానికి చెందిన అంకుశ, సవిత పాత కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 10న పాత కాగితాలు ఏరుకునేందుకు నగరంలోని ఆర్సపల్లికి వెళ్లారు. తర్వాత నిజామాబాద్ రైల్వే స్టేషన్ వెళ్లి నవీపేటకు వచ్చే రైలుకు బదులు వేరేరైలు ఎక్కి కాచిగూడకు వెళ్లారు. అక్కడి నుంచి తల్లి బుజ్జమ్మకు ఫోన్ చేశారు. కాచిగూడ రైల్వే పోలీస్‌లు వారిని నిజామాబాద్‌కు పంపగా స్థానిక పోలీసులు వారిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## నిరుపయోగంగా వాటర్ ట్యాంకు



నిరుపయోగంగా మారిన ట్యాంక్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణంలోని 19వ వార్డు, ఎంకె ఫంక్షన్ హాల్‌కు వెళ్లే దారిలో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. వాటర్ ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. వాటర్ ట్యాంకు పక్కన బోరు బావి ఉన్నప్పటికీ ట్యాంకుకు పైపలైన్ కనెక్షన్ ఇవ్వలేదు. వేసవి కాలం కావడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మోటర్ నుంచి ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## మూలన పడిన సామూహిక మరుగుదొడ్లు



నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో ప్రధాన కూడళ్ల వద్ద నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ లేక మూలన పడ్డాయి. ప్రజాధనం దుర్వినియోగమైంది. రెండేండ్ల క్రితం లక్షల వ్యయంతో వీటిని నిర్మించారు. ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. మొదట్లో నిర్వహణ బాగుండేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. పరిశుభ్రత పాటించకపోవడంతో పూర్తిగా నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆలయంలో చోరీ

బాల్కొండ, ఏప్రిల్ 15: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం చోరీ జరిగింది. దుండగులు ముందుగా సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. హుండీ తాళం పగలగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లారు. పోలీసు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## హత్య కేసులో నిందితుల రిమాండు

మాక్లూర్, ఏప్రిల్15: మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండుకు తరలించినట్లు నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎస్సై రాజశేఖర్‌తో కలిసి హత్యకేసు వివరాలు వెల్లడించారు. చిక్లీ గ్రామానికి చెందిన కారం నవీన్‌కు, చిన్న గంగారాంకు పంట పొలం విషయంలో కొంతకాలంగా తగాదాలున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడినా ఈ గొడవ కొలిక్కిరాలేదు. తనను చిన్న గంగారాం దూషిస్తున్నాడని అతనిపై కారం నవీన్ కక్ష పెంచుకున్నాడు. ట్రాక్టర్‌తో ఢీకొట్టి చిన్న గంగారాంను హత్య చేసేందుకు కారం నవీన్ పథకం పన్నాడు. గ్రామానికి చెందిన ఎడగొట్టి ప్రసాద్ సహకారంతో ఈనెల 13న ఉద్దేశ పూర్వకంగా ట్రాక్టర్‌తో చిన్న గంగారాంను ఢీకొట్టారు. చికిత్స పొందుతూ చిన్న గంగారాం 14న మృతి చెందాడు. మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

## కరపత్రాల ఆవిష్కరణ

మాక్లూర్, ఏప్రిల్15: బోర్గాం(కె) గ్రామంలో మంగళవారం జెల్ల మురళీ సంస్మరణ సభ కరపత్రాలను సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబ మాట్లాడుతూ జెల్ల మురళీ ప్రెస్ కార్మికుడిగా తన జీవితాన్ని ప్రారంభించి నాలుగున్నర దశాబ్దాలు కార్మిక వర్గానికి సేవ చేశారని గుర్తు చేశారు. ఈనెల 17న ఆయన సంస్మరణ సభ నీలం రామచంద్రయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, దేవరాజ్, మల్లికార్జున్, శివకుమార్, అరుణ, నీలం లక్ష్మి, సంజన తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణ శివారులోని గుండ్ల చెరువులో పడి గుంట గంగామోహన్ రెడ్డి(65) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఎస్‌హెచ్‌వో కథనం మేరకు.. గుండ్ల చెరువులో గుంట గంగామోహన్‌రెడ్డి బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మంగళవారం సాయంత్రం లారీ ఢీ కొన్న ఘటనలో గంగాధర్(55) మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ కథనం మేరకు.. జిరాయత్ నగర్‌లో నివాసముంటున్న గంగాధర్ పలు దవాఖానలు, లాడ్జీల్లో స్కావెంజర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గంగాధర్ తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నిజాంసాగర్ కెనాల్ సమీపంలో క్లాక్ టవర్ వద్ద సిమెంట్ లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ..

బోధన్ రూరల్, ఏప్రిల్ 15: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్‌కు చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగేశ్ సుజాత (35) నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె కల్లుకు బానిసగా మారింది. కల్లు మత్తులో పురుగుల మందు తాగింది. మృతురాలి తల్లి నాగేశ్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.